### ఆ రోజులు మాకొద్దు..



కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు ఏ నాయకుడు పంచుకున్న పాపాన పోలేదు. కరెంటు సక్కగ ఇయ్యికపోతుండే.. మోటర్లు కాలిపోయేది. అర్ధ రాత్రి అపరాత్రి లేకుండా పొలాల పొంటి పోయేవాళ్లం.. చీకట్లో విషపురుగుల పాలయ్యేటోళ్లం. తెలంగాణ వచ్చానంక పంటలు బాగుపడ్డాయి. కాంగ్రెసోళ్లు ఇచ్చే 3 గంటల కరెంటు ఎట్ల సరిపోతది. కొంచమన్నా దిమాకు ఉందా వాళ్లకు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లా పాతరోజులు వస్తాయి. ఆ రోజులు మాత్రం మాకొద్దయా. ఇప్పుడు కేసీఆర్ సార్ 24 గంటల కరెంటు ఇస్తుండు.. మాకు నాలుగు ఎకరాలు పోడు పట్టా వచ్చింది. గిరివికాస్ కింద బోరు కూడా వేశారు. మాకిష్టమొచ్చినప్పుడు బాయికాడికి పోయి మోటరు ఏసుకుంటునం. నిమ్మలంగా ఉన్నాం.

**– బానోత్ హరి, రైతు, రుద్రంపూర్, చుంచుపల్లి**

### ధరణి తీసేస్తే రైతులు ఆగమైతరు



ధరణి పోర్టల్‌ను రద్దుచేస్తే రైతులు ఆగమైతరు. రైతుల భూ రికార్డులు ధరణితోనే భద్రంగా ఉన్నాయి. కాంగ్రెసోళ్లు తీసుకువచ్చే భూమాతతో రైతులకు పాత పరిస్థితులే ఉత్పన్నమైతాయి. రెవెన్యూ కార్యాలయం చుట్టూ మళ్లీ రైతులు తిరగాల్సిన పరిస్థితి ఉంటుంది. గతంలో లంచాలు ఇవ్వకపోతే భూములు మరొకరి పేరుకు మార్చి అధికారులు రైతులను నట్టేట ముంచారు. దళారుల వ్యవస్థ మళ్లీ మొదలై రైతులకు ఇబ్బందులు తప్పవు. ధరణి కొనసాగిస్తేనే రైతుల భూములు భద్రంగా ఉంటాయి.

**– బొల్లి వెంకట్రావు, రైతు, తూరుబాక, దుమ్ముగూడెం**

### కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలే..



కాంగ్రెస్‌వాళ్లకు పగ్గాలు అప్పగిస్తే మళ్లీ రైతులకు కరెంటు కష్టాలు తప్పవు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వ్యవసాయం దండగ నుంచి పండగ చేసిన సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చి రైతుబంధు ఇచ్చి రైతులను అభివృద్ధి చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటలు కరెంటు ఉండదు. రైతులు మళ్లీ కరెంటు లేక వ్యవసాయం మానేసే పరిస్థితులు ఉంటాయి. కాంగ్రెస్ పాలకులు రైతులు, వ్యవసాయంపై అవగాహన లేక ఇలా మాట్లాడుతున్నారు.

**– మర్మం గంగరాజు, రైతు, అడవి రామవరం, దుమ్ముగూడెం**

### 3 గంటలకు మడి కూడా తడవదు




కాంగ్రెస్ చెప్పినట్టు మూడు గంటల కరెంటుతో రైతు పొలంలో మడి కూడా తడవదు. 24 గంటల కరెంటుతోపాటు 5హెచ్‌పీ మోటర్లతో ఇప్పుడు రైతులు ఎంతో సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 3 గంటలు కరెంటు, 10హెచ్‌పీ మోటర్లతో రైతులపై భారం పడటమేకాకుండా రైతుల వ్యవసాయానికి మళ్లీ ఇబ్బందులు తప్పవు. చీకట్లోనే రైతులందరూ ఉండేపరిస్థితి ఏర్పడుతుంది. 24 గంటల కరెంటుతో పాటు 3, 5హెచ్‌పీ మోటర్లు రైతులకు సరిపోతాయి.

**– శీలం ప్రసాదరావు, రైతు, లచ్చిగూడెం, దుమ్ముగూడెం మండలం**

# భూమాత వస్తే భూ బకాసురులు వస్తరు!

**ధరణితోనే భూముల భద్రత..**
**భూ యజమానులకు భరోసా**



- **మూడు గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా తడవదు**
- **10 హెచ్‌పీ మోటర్లు వద్దు.. కరెంట్ కోతలు వద్దు..**
- **కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బతుకు అంధకారమే..**
- **బీఆర్‌ఎస్ పక్షాన నిలుస్తామంటూ తేల్చి చెప్తున్న రైతాంగం**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ): కాంగ్రెస్ పాలన అంటేనే దళారుల రాజ్యం.. ఆ పార్టీ నేతలే దళారుల అవతారం ఎత్తుతారు. నీకు ఇందిరమ్మ ఇల్లు కావాలన్నా, పింఛను కావాలన్నా.. వారి చేయితడపాల్సిందే. ఏ ప్రభుత్వం పథకం కొత్తగా వచ్చినా వాళ్లదే రాజ్యం.. భూకబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు రాజ్యమేలిన రాజ్యం కాంగ్రెస్ రాజ్యమే. కాంగ్రెస్ పాలనలో భూ సమస్యలకు పరిష్కారం చూపే నాథుడే ఉండేవాడు కాదు. బూజు పట్టి, చెదలు పట్టి ఉన్న రెవెన్యూ చట్టాల్లో లొసుగులు అధికారుల పాలిట బంగారు గుడ్లు పెట్టే బాతులు. అధికారి చెప్పిన అమౌంట్ సెట్ చేస్తే చాలు.. ఎవరి భూమి ఎవరి పేరునైనా రాసిస్తారు.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సర్వే నంబర్లకు 'బై..' కల్చర్ పుట్టుకొచ్చింది. భూబకాసరుల భూకబ్జాలకు హద్దు పద్దూ ఉండేది కాదు. ఒక రైతు అవసరమొచ్చి భూమిని అమ్మితే, కొన్న వ్యక్తి రిజిస్ట్రేషన్ పెద్ద ప్రహసనం. రిజిస్ట్రేషన్ కోసం ఏళ్ల పాటు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సివచ్చేది. ఈ సమస్యలన్నింటినీ అర్థం చేసుకున్న కేసీఆర్ తెలంగాణ వచ్చిన తర్వాత సీఎంగా భూరికార్డుల ప్రక్షాళన చేశారు. కొత్త రెవెన్యూ చట్టాలు తెచ్చారు. భూములు, భూరికార్డుల భద్రత కోసం 'ధరణి' పోర్టల్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు రైతు భౌతికంగా రెవెన్యూ కార్యాలయంలో హాజరైతే తప్ప వేరొకరి పేరుపై రిజిస్ట్రేషన్ చేసే అవకాశం లేని పటిష్ట వ్యవస్థను తీసుకొచ్చారు.

**మూడు గంటల కరెంట్ వద్దు..**

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతలు రైతుబంధును బంగాళాఖాతాలో కలుపుతామంటున్నారు. పంటలకు కేవలం మూడు కరెంట్ ఇస్తామంటున్నారు. రైతులు 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలంటున్నారు. ఇలాంటి అతీగతి లేని మాటలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల పాటు కరెంట్ ఇస్తుంటే, కేవలం మూడు గంటలు కరెంట్ సరిపోతుందని వ్యాఖ్యలు చేయడంపై మండిపడుతున్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్, భూముల భద్రతకు ధరణి అవసరమని తేల్చి చెప్తున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తామంటున్నారు.

### కౌలు, పట్టా రైతులకు పంచాయితీ తప్పదు..



పట్టా పుస్తకంలో కౌలు రైతుల పేర్లు ఇస్తే పట్టా రైతులకు కౌలు రైతులకు పంచాయతీ మొదలైతది. రైతులు ప్రశాంతంగా ఉండడం కాంగ్రెసోళ్లకు ఇష్టం లేనట్లు ఉంది. కాంగ్రెసోళ్లు ధరణిని రద్దు చేస్తామంటున్నారు. పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తెస్తామంటున్నారు. భూముల సమస్యలు తీరక అప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్ల వీఆర్‌వోల వెంబడి కాళ్లరిగేలా తిరిగినం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చినంగ ధరణి తీసురావడంతో రైతుల బాధలు తప్పినయ్. కాంగ్రెస్ గవర్నమెంట్ల వీఆర్‌వోలు, దళారుల వెంబడి తిరగడానికి సమయం సరిపాయే. ఇప్పుడు రైతులు ప్రశాంతంగా ఉంటున్నారు. అప్పటి పరిస్థితి మళ్లీవస్తే భూముల పట్టాలు ఆగమైతవి. పాతోళ్లకు పట్టాలు ఇస్తమంటున్నారు. వారికి పట్టాలిస్తే మా బతుకులు ఏంకావాలే. లేని పంచాయతీల పెంచడానికా మీకు ఓటేసేది. రిజిస్ట్రేషన్ దగ్గర, మ్యూటేషన్ దగ్గర లంచం ఇచ్చే పరిస్థితి ఉండేది. రిజిస్టేషన్ చేసుకున్నా కూడా వీఆర్‌వోలు, ఎంఆర్‌వోలకు పైసలు ఇవ్వకుంటే పట్టా ఇచ్చేవారు కాదు. వీఆర్‌వోలు, ఎంఆర్‌వోల దయ మీద పట్టాలు ఆధారపడేవి. డబ్బులిచ్చినా కొన్నేండ్లకు పట్టాలు వచ్చేవి. అప్పట్లో 7వ నెంబర్ ఫారం రాయకుండానే పట్టా పాసుపుస్తకాలు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో చూస్తే అమ్మిన వారి పేరే ఉండేది. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ వచ్చాక ఆ సమస్యలు పూర్తిగా తొలిగిపోయాఇయ. ఇప్పుడు కాంగ్రెస్ మళ్లా పాత పద్ధతి తెస్తామంటున్నారు. వారి కల్లబొల్లి మాటలు నమ్మి చేతికి ఓటేస్తే రైతుల పరిస్థితి అథోగతే.

**– మల్లేష్, రైతు, పెనుబల్లి, చుంచుపల్లి**

### ధరణితో రైతులకు ఎంతో మేలు



ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ధరణి ఫోర్టల్‌ను రద్దు చేస్తే పూర్వకాలం నాటి పైరవీల రాజ్యం వస్తుంది. దళారుల ప్రమేయం పెరిగి రైతుల భూములను గోల్‌మాల్ చేసే ప్రమాదం ఉంటుంది. రైతుల మధ్య అగాధం పెంచేందుకు కాంగ్రెస్ వాళ్లు ప్రయత్నం చేస్తున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థ మళ్లీ వస్తే రైతులకు గోస మొదలైనట్లే. పట్టాదారు స్థానంలో తిరిగి అనుభవదారు, మాన్యందారు కాలమ్‌లను పెట్టడంతో నిజమైన పట్టాదారులకు తిప్పలు తప్పవు. రోజలతరబడి అధికారులు, లీడర్ల చుట్టూ తిరిగే రోజులు మళ్లీ వస్తాయి. భూసమస్యలు లేకుండా ఉండాలంటే ధరణి వ్యవస్థ ఉండాల్సిందే.

**– వేముల భాస్కరరావు, రైతు, ఎర్రగుంట, అన్నపురెడ్డిపల్లి మండలం**

### కేసీఆర్ వల్లే 24గంటల విద్యుత్



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాక ముందు గ్రామాల్లో కరెంట్ ఎప్పుడు వస్తుందో,ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పుడు రైతులకు 24 గంటలు ఉచితంగా ఇస్తున్నారు. వ్యవసాయానికి కరెంట్ సరిగా సరిపోక విద్యుత్ మోటర్లు కాలిపోతుండేవి. నీరులేక పొలాలు ఎండిపోయేవి. తెలంగాణ వస్తే రాష్ట్రంలో కరెంట్ లేక చీకటిమయం ఏర్పడేదని ఆనాడు ఆంధ్ర నాయకులు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఇప్పుడు రాష్ట్రం మొత్తం విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తుంది. రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందాలంటే మూడోవసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అయితేనే అది సాధ్యం.

**– జాటోత్ నరేశ్, ప్రేగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం, టేకులపల్లి మండలం**

### రెండు మూడు రోజుల్లోనే తడి తిరుగుతుంది



24 గంటల కరెంటుతో రెండు మూడు రోజుల్లోనే తడి తిరుగుతుంది. తరువాత మిగతా పనులు చేసుకుంటున్నాము. ఉమ్మడి ఆంధ్రా పాలనలో పగలు మూడు, రాత్రిళ్ళు మూడు గంటలు ఇవ్వడం కనాకష్టంగా మారేది. అదీ ఎప్పుడు వచ్చేదో తెలీక కళ్ళు కాయలు కాసేలా చూసేటోళ్లం. తెలంగాణ వచ్చాక వ్యవసాయానికి కరెంటు కొరత లేదు. ఉదయం తొమ్మిది గంటలకు బోరు వేసి చేనుకు నీళ్లు పెట్టుకుంటున్నాము. బోరు ఆన్ చేసి వచ్చి చేలో కూలీలతో కలిసి పని చేసుకుంటున్నాము. మళ్ళీ కేసీఆర్ వస్తే బాగుంటుంది.

**– ఏపుగంటి రామారావు, ఊట్లపల్లి రైతు, అశ్వారావుపేట మండలం**

### ఇప్పడే వ్యవసాయం బాగుంది



తెలంగాణకు ముందుకంటే ఇప్పుడే వ్యవసాయం బాగుంది. 30 ఏళ్ల నుంచి కౌలు వ్యవసాయం చేస్తున్న. అప్పుడు వ్యవసాయం చేయాలంటే ప్రాణం మీదకు వచ్చేది. చెరువులో నీళ్లు ఉండేవి కావు. మోటరులోకి కరెంటు ఎప్పుడు వచ్చేదో తెలిసేది కాదు. కేసీఆర్ వచ్చినాక వ్యవసాయం బాగా ఉంది. చెరువులో నీరు, బోరులో కరెంటు ఎప్పుడూ ఉంటున్నాయి. పంటలు కూడా గతంకంటే బాగా పండుతున్నాయి. కౌలు వ్యవసాయమే అయినా.. 24 గంటలు విద్యుత్ ఉండటతో పంట దిగుబడులు బాగా పెరిగాయి.

**– తోట బంగారి, కౌలు రైతు, అశ్వారావుపేట టౌన్**

### ధరణితో రైతులకు ఎంతో ఉపయోగం



తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణితో రైతులకు ఎంతో ఉపయోగం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే ధరణి తీసేస్తే రైతులు అనేక విధాలుగా ఇబ్బందులకు గురవుతారు. ఎప్పటికప్పుడు రైతులకు కావాల్సిన సమాచారం అందుబాటులో ఉంటుంది. రైతులను ఆదుకునే ప్రభుత్వం కేవలం కేసీఆర్ ప్రభుత్వమే. మా మద్దతు ఆయనకే ఉంటుంది.

**– బి.మంగ్యా, రైతు, లక్ష్మీదేవిపల్లి**

### భూమాత వద్దు... ధరణియే ముద్దు



తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ సూపర్. అరగంటలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 15 రోజుల్లో పాస్‌బుక్ ఇంటికి వస్తుంది. ఒక రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదు. మన తంబు వేస్తేనే పోర్టల్ ఓపెన్ అవుతుంది. మన భూమి ఎక్కడికి పోదు. ల్యాండ్ కన్వర్షనర్ కూడా 10 నిమిషాల్లో అయిపోతుంది. అదే ఇదివరకటి కాలంలో మండల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది.. కింది నుంచి పైదాకా ప్రతి అధికారికి లంచం ఇయాల్సి ఉండేది. తిరిగి దాన్నే కాంగ్రెస్ తీసుకొస్తానంటుంది. రైతులు చాలా నష్టపోతారు..

**– రెడ్డెం తులసీరెడ్డి, కొత్తగూడెం**